క్లుప్తంగా

దాచేపల్లి తహసీల్దార్‌గా మేరి కనకం

దాచేపల్లి : తహసీల్దార్‌గా డి.మేరికనకంను ఉన్నతాధికారులు నియమించారు. గురజాల తహసీల్దార్ కార్యాలయంలో డెప్యూటీ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మేరి కనకంను దాచేపల్లి తహసీల్దార్(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ కలెక్టర్ లోతేటి శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మేరి కనకం బాధ్యతలు స్వీకరించనున్నారు. గురజాల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మీసాల దానియేలు ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేశారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం



దాచేపల్లి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి వారధి ఫౌండేషన్ గురువారం ఆర్థికసాయం అందజేసింది. కేసానుపల్లికి చెందిన పొట్టశిరి వెంకటేశ్వర్లు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వారధి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తగరం ఆనంద్‌కుమార్ వెంకటేశ్వర్లుకు వైద్యం నిమిత్తం ఫౌండేషన్ తరుపున రూ.15వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ షరీఫ్, యూటీఎఫ్ నాయకులు వట్టిపు నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, సుదర్శన్, కొలా నవజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



దాచేపల్లి : రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని ఎంపీపీ కటకం జయశ్రీ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం గురువారం జరిగింది. ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు సమర్థంగా పనిచేయాలని, రేషన్ సరుకులను కార్డుదారులకు సక్రమంగా అందించాలని పేర్కొన్నారు. రేషన్ బియ్యం కార్డుదారులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేలా అధికారులను కోరతామని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



పిడుగురాళ్ల: వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో గురువారం జరిగింది. ఖలీల్ దాబా వైపు ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. అతని వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎత్తు 5.7, రంగు చామన చాయ, గచ్చకాయ రంగు షర్టు, షార్ట్ ధరించి ఉన్నాడని, అతని ఆచూకీ తెలిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు వెల్లడించారు.

సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

గురజాల : ప్రజలు సుఖవ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు సూచించారు. పులిపాడు గ్రామంలో గురువారం సాయంత్రం ఏపీ సాక్స్, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి సోకి హైరిస్కు వారిని గుర్తించి వారికి హెచ్ఐవీ ఎలా వ్యాప్తి చెందుతుంది అన్న విషయాల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. టీబీతో పాటు సుఖ వ్యాధులు ఎలా సోకుతాయి అన్న విషయాలపై అవగాహన కల్పించారు. పరీక్షలు చేయించుకుని వ్యాధి సోకినట్టయితే మందులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, ఏఎన్ఎంలు, వలంటీర్లు, లింక్ వర్కర్‌లు, ఆశా, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు అమృతాహారం

అచ్చంపేట: నారాయణ సేవలో భాగంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం 120 మంది గర్భిణులకు అమృతాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ తిమ్మిశెట్టి రాంబాబు మాట్లాడుతూ తమ సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రతినెలా 9వ తేదీన మండలంలో గర్భిణులందరికీ అమృతాహారాన్ని పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మామిళ్లపల్లి విజయలక్ష్మి, జిల్లా కో–ఆర్డినేటర్ సూదా వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్యామల, డాక్టర్ రాజేష్, సమితి సభ్యులు అనిల్ కుమార్, గార్లపాటి సాంబశివరావు, పొట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యం

- జన సంక్షేమంలో ఆయన దేశంలోనే నంబర్ వన్ సీఎం
- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి స్పష్టీకరణ
- అడిగొప్పలలో అట్టహాసంగా గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: నిరంతరం రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే నంబర్ వన్ ముఖ్యమంత్రిగా నిలిచారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం అడిగొప్పల గ్రామంలో ఐదో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక మహిళలు, యువకులు, పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపక్షాలు, ఎల్లో మీడియా విష ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆరోపించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రజల హృదయాలలో సీఎం జగన్ నిలిచారన్నారు. అడిగొప్పల గ్రామంలో గత మూడున్నరేళ్లలో దాదాపుగా రూ.12 కోట్ల మేర లబ్ధి చేకూరిందని, ఈ మొత్తం నేరుగా ప్రజల ఖాతాల్లో జమైందని గుర్తుచేశారు. అర్హులందరికీ పథకాలు అందిస్తున్న గొప్ప ప్రభుత్వం తమదని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అమలవుతాయని పేర్కొన్నారు. ప్రజాభివృద్ధి తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామంలోనే ప్రజలకు అందుబాటులో ఉండి దాదాపుగా 500కుపైగా పౌర సేవలను ప్రజలకు అందజేయటం మహోన్నత కార్యక్రమమన్నారు. అనంతరం గ్రామస్తులు స్థానిక సమస్యలను ప్రభుత్వ విప్ పీఆర్కే దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి సంబంధిత అధికారులను పిలిపించి పరిష్కారమయ్యేలా పనిచేయాలన్నారు. ఐదో రోజు 343 మంది లబ్ధిదారుల గడపలకు వెళ్ళి వారు పొందిన ప్రభుత్వ లబ్ధి గురించి పిన్నెల్లి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాలి రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఉరుబండి యోగయ్య, మండల అధికారులు, నాయకులు నల్లబోతు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ షేక్ హుస్సేన్, పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, జంగా యలమంద, తోట వాసు, కటకం చిన వెంకటయ్య, సంక్రాంతి సీతయ్య, గర్ని లక్ష్మినారాయణ, మాజీ జెడ్పీటీసీ కొనకంచి బాబు, సంక్రాంతి నాలి శ్రీను, గురువులు, డాక్టర్ వెంకయ్య, జక్క రమేష్, రాయపాటి నాగేశ్వరరావు, కోట బ్రహ్మం, నాగెండ్ల లక్ష్మీనారాయణ, షేక్ జానీ, చిలకల అంజిరెడ్డి, తలపరపు కోటేశ్వరరావు, మాచర్ల జార్జి, సచివాలయం కన్వీనర్లు రాయల మధు, మల్లెతోట జానీ, వేముల సత్యనారాయణ, తాళ్ళ అంబారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సరిగా అందించకుంటే చర్యలు

మండల పరిషత్ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధుల ఆగ్రహం



అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై వివరణ కోరుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

కారంపూడి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ కావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని, పరిస్థితి ఇలాగే ఉంటే ఈ విషయమై ప్రభుత్వానికి నివేదించాల్సి వస్తుందని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ మేకల శారద అధ్యక్షతన గురువారం జరిగింది. పలువురు ఎంపీటీసీలు అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన సరుకు వచ్చినట్టే అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయని, ఈ విషయం పలుమార్లు తమ పరిశీలనలో కూడా తేలిందని ఎంపీపీ శారద, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి చెప్పారు. పద్ధతి మార్చుకోవాలని ఐసీడీఎస్ సిబ్బందికి హితవు పలికారు. తాము కొత్తగా వచ్చామని మరుసటి సమావేశం నాటికి ఆరోపణలు లేకుండా చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ అధికారులు వివరణ ఇచ్చారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

మండలానికి కొత్తగా మంజూరైన 341 ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందించాలని ఎంపీడీఓ అధికారులను ఆదేశించారు. సొంత స్థలాలు ఉన్న వారు కూడా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సాయం అందించనున్నట్లు హసింగ్ ఏఈ తెలిపారు. ఇప్పటికే వైఎస్సార్, జగనన్న కాలనీలలో 2,277 మందికి నివేశన స్థలాలు ఇచ్చినట్టు వెల్లడించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను పరిష్కరిస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ వివరించారు. అన్ని శాఖల అధికారులు తమ పనితీరు ప్రగతిని సమావేశంలో వివరించారు. కారంపూడిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి స్థలం కేటాయిస్తే తాము నిర్మించడానికి ముందుకు వస్తామని ఎంపీటీసీ వేముల లింగయ్యపద్మ చెప్పారు. ప్రభుత్వ స్థలాలన్నీ కబ్జాలకు గురవుతున్నాయని ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడో కట్టుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ షేక్ షఫీ, తహసీల్దార్ శ్రీనివాస్ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ బహూకరణ



సత్తెనపల్లి: స్థానిక ఏరియా వైద్యశాలలో నేత్ర శస్త్రచికిత్స పరికరాలు భద్రపరిచేందుకు అవసరమైన ఫర్నిచర్‌ను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ గురువారం అందించారు. వైద్యశాలలో నేత్ర శస్త్రచికిత్సల కోసం సుమారు రూ.10 లక్షలు విలువ చేసే పరికరాలను పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్ ఇటీవల అందించారు. ఆ పరికరాలను భద్రపరిచేందుకు అవసరమైన ఫర్నిచర్ లేకపోవడంతో స్పందించిన కొత్త రామకృష్ణ ఫర్నిచర్ చేయించి అందించారు. వైద్యశాల సూపరింటెండెంట్ ఈటిపోగు వెంకట్రావు రామకృష్ణను అభినందించారు. నేత్ర వైద్యురాలు తనూజ పాల్గొన్నారు.

సత్రశాల ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం



సత్రశాల దేవస్థానం కొత్త పాలకవర్గంతో జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి తదితరులు

రెంటచింతల: సత్రశాల వద్ద కృష్ణానది తీరాన వేంచేసిన అతిపురాతన శైవక్షేత్రం గంగా మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి కొత్త పాలకవర్గం కృషి చేయాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి కోరారు. గురువారం కొత్త పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బద్దూరి బ్రహ్మారెడ్డి, పాలకవర్గ సభ్యులను అభినందించారు. మహాశివరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించాలని సూచించారు. తొలుత దేవస్థానం ఆవరణలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎన్.లీలావతి పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డిని అధికారులు, ప్రజా ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్‌యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన నాయకులు మోర్త ఉమ, పార్టీ మండల అధ్యక్షులు పూజల రామయ్య, యూత్ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, సర్పంచ్‌లు దావులూరి ఉదయకుమారి రమేష్, మున్నా చంద్రం, గొట్టం ప్రమీలగురవారెడ్డి, గొలమారి నాగలక్ష్మిశ్రీనివాసరెడ్డి, పొట్లపాటి చంద్రారెడ్డి, ఎంపీటీసీ రమావత్ సీతమ్మ, ఈవో గాదె రామిరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్‌లు వేముల పిచ్చయ్య, చల్లా మట్టారెడ్డి పాల్గొన్నారు.

దళిత, గిరిజన మహిళల అభివృద్ధితోనే సాధికారత

సత్తెనపల్లి: దళిత, గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించిననాడే స్త్రీ సాధికారత సాధ్యమవుతుందని సత్తెనపల్లి మండల అసిస్టెంట్ ప్రోగ్రామ్ మేనేజర్ శిఖా కృపావేణి చెప్పారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ధూళిపాళ్లలోని మండల వెలుగు కార్యాలయంలో దళిత, ఆదివాసీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. సదస్సుకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఉమ్మడి గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. కృపావేణి మాట్లాడుతూ దళిత గిరిజన మహిళా సంఘాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ముఖ్యోద్దేశంతో ఉన్నతి పథకం ద్వారా ఇచ్చిన రుణాల ద్వారా యూనిట్లు ఏర్పాటు చేసి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు భవనం శివమ్మ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి, చేదోడు, చేయూత, అమ్మఒడి, గృహ నిర్మాణం, సంక్షేమం, అభివృద్ధి, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీ రోజారాణి, బుల్లిబాబు, దానియేలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

నకరికల్లు: స్పందన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. గుండ్లపల్లి గ్రామంలో గురువారం పర్యటించిన ఆయన పలు సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుండ్లపల్లి గ్రామంలోని ఎస్సీకాలనీ, అంబేడ్కర్‌కాలనీకి చెందిన విద్యార్థులు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి రాగా గ్రామ రెవెన్యూ, సర్వే అధికారులతో సర్వే చేయించి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. కొత్తపల్లి యలమంద తన భూమికి సంబంధించిన సమస్య పరిష్కారానికి స్పందనలో అర్జీ పెట్టుకోగా సదరు భూమిని పరిశీలించినట్లు తెలిపారు. గ్రామంలోని ఎస్సీ శ్మశానానికి వెళ్లేందుకు గల దారి ఆక్రమణకు గురైందని స్పందనలో వచ్చిన దరఖాస్తు మేరకు క్షేత్రస్థాయిలో మ్యాప్ ఆధారంగా విచారణ చేపట్టామన్నారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని అర్జీదారులకు భరోసానిచ్చామని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో రేషన్ సరఫరా చేస్తున్న వాహనాన్ని సురేష్ తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి ప్రసాద్, సర్వేయర్ ఎస్.చంద్రబాబు, కార్యదర్శి జాన్‌పీరా, ప్రధానోపాధ్యాయుడు జాన్ పీరా, గ్రామ సర్వేయర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జెట్టిపాలెం నుంచి నరసరావుపేటకు బస్సు సౌకర్యం



రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెం గ్రామం నుంచి పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు ఏపీఎస్ ఆర్టీసీ మాచర్ల డిపో నుంచి గురువారం బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు డిపో మేనేజర్ రెంటపాళ్ళ పిచ్చయ్య తెలిపారు. ప్రతి రోజు పాలువాయి జంక్షన్ నుంచి జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌కు విద్యార్థులను చేరవేసిన అనంతరం ఉదయం 8 గంటలకు బస్సు నరసరావుపేటకు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సు జెట్టిపాలెం నుంచి పశర్లపాడు, పాలువాయి జంక్షన్, రెంటచింతల, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ళ మీదుగా నరసరావుపేటకు చేరుతుందని పేర్కొన్నారు. సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, గిరిజన నాయకులు వడితే శంకర్ నాయక్ తదితరులు ఆర్టీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం



దాచేపల్లి: గామాలపాడులో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి సత్యనారాయణ ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, సర్పంచ్ జంగా సురేష్, ఎంపీటీసీ షేక్ ఆదాం సాహెబ్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ శేషయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ప్రసాదం నాయకులకు అందించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అమ్మవారి కల్యాణం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నేటి నుంచి ఒప్పిచర్ల తిరనాళ్ల



కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి తిరునాళ్ల శుక్రవారం, శనివారం రెండు రోజులు జరగనుంది. 53 ఏళ్లుగా స్వామి ఉత్సవాలు ఏటా జరుపుకోవడం గ్రామస్తులకు ఆనవాయితీగా వస్తోంది. బహుళ పంచమి శుక్రవారం తెల్లవారుజామున అంకురార్పణ అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణమహోత్సవం జరుగుతుందని, సాయంత్రం ఆరు గంటలకు స్వామి ఊరేగింపు జరుగుతుందని దేవాలయ పీఠాధిపతి మండోజి వీరబ్రహ్మాచారి తెలిపారు. శనివారం శివపార్వతుల కల్యాణం, మహాన్నదాన కార్యక్రమాలు, రాత్రికి స్వామికి గ్రామస్తులు ప్రభలు కట్టి మొక్కులు తీర్చుకుంటారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

ముప్పాళ్ళ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదల నెత్తిన భారాలు మోపి కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేదిగా ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ విమర్శించారు. అఖిల భారత కిసాన్ సభ, వ్యవసాయ కార్మిక సంఘం బడ్జెట్‌కు వ్యతిరేకంగా చేపట్టిన దేశవ్యాప్త నిరసనలో భాగంగా గురువారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తొరటి అమరలింగేశ్వరరావు, నరసింహారావు, ప్రసాదు, ఏడుకొండలు, శ్రీను, జగన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు



మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న దృశ్యం

సత్రశాల(రెంటచింతల): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి కోరారు. గురువారం స్థానిక దేవస్థానం ప్రాంగణంలో ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. శివరాత్రి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కృష్ణానదిలో స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సత్రశాల వరకు ఉన్న రహదారికి ఇరువైపులా ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని జెట్టిపాలెం కార్యదర్శికి ఆదేశించారు. అఖండ దీపారాధన సమయంలో శిఖరం వద్దకు ఆచారవంతులను మాత్రమే అనుమతించి వచ్చిన భక్తులందరికీ ప్రత్యక్షంగా దర్శించుకునే అవకాశం కల్పించాలని ఈవో గాదె రామిరెడ్డిని కోరారు. సత్రశాలలోని 20 అన్నదాన సత్రాలవారు ఒక్కొక్కరూ 10 మంది చొప్పున స్వచ్ఛందంగా వలంటీర్లను ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాలను పార్కింగ్ చేయించుకోవాలని కారంపూడి సీఐ డి.జయకుమార్ సూచించారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి తెలిపారు. ఆర్టీసీ 30 బస్సులను నడపనున్నట్లు మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య తెలిపారు. అవసరాన్ని బట్టి సర్వీసులను పెంచుతామని చెప్పారు. పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఏపీ జెన్‌కో అధికారులు మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడానికి సహకరించాలని దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి కోరారు. సమావేశంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎన్. లీలావతి, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం, ఏపీ ట్రాన్స్‌కో ఏఈ మస్తాన్‌వలి, జెట్టిపాలెం సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, పీఆర్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఏఈ నరేంద్రారెడ్డి, ఎంపీటీసీ రమావత్ సీతమ్మ పాల్గొన్నారు.

బేస్ బాల్ టోర్నీలో స్కాలర్స్ డిగ్రీ కాలేజీ రన్నర్



జట్టును అభినందిస్తున్న స్కాలర్స్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్లు, ప్రిన్సిపల్

పిడుగురాళ్ల: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన అంతర కళాశాలల బేస్‌బాల్ టోర్నమెంట్‌లో స్కాలర్స్ డిగ్రీ కాలేజీ జట్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జట్టును కళాశాల చైర్మన్ జీపీరెడ్డి, డైరెక్టర్స్ శ్రీనివాస్‌రెడ్డి, పకీరరెడ్డి, జగదీష్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఆవుల జనార్దన్‌రావు గురువారం అభినందించారు. టోర్నీలో ప్రతిభ చాటిన శ్రీ హరి, చైతన్య, ఈశ్వర సాయిను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపిక చేయటం అభినందనీయమని పేర్కొన్నారు. అసోంలో జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో దాచేపల్లి క్యాంపస్ ఇన్‌చార్జి రంగారెడ్డి, ఏసీ క్యాంపస్ ఇన్‌చార్జి గాదె బ్రహ్మారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వంట్ల రామారావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రత్యేకాధికారి బస



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

కారంపూడి: స్థానిక గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు పెడుతున్న ఆహారాన్ని మండల ప్రత్యేక అధికారి జోసెఫ్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి కూర్చుని భోజనం చేశారు. దోసకాయ పప్పు, సాంబారు, మజ్జిగతో స్వీటు, హాటు వడ్డించారు. రోజూ భోజనం ఎలా ఉంటోంది? బాగా చదువుతున్నారా అంటూ వారు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం బాగానే ఉంటోందని, బాగా చదువుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు. అన్నం కొంచెం బాగాలేదని నాణ్యత పెంచి పెట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డికి అధికారులు సూచించారు.